క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సాబ్‌జాన్

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడుకు చెందిన టీడీపీ నేత షేక్ సాబ్‌జాన్ ఆదివారం రాత్రి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుడిగా పని చేసిన సాబ్‌జాన్ ధర్మబద్ధంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సాబ్‌జాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని, ఆయన పాలనపై ఆకర్షితుడునై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, మైనార్టీ నాయకులు రఫీ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

అచ్చమాంబ దేవస్థానం హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో ధర్మకర్త మండలి సభ్యులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువై ఉన్న అచ్చమాంబ దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు హుండీ లెక్కింపు నిర్వహించారు. భక్తుల ద్వారా రూ.62,450 అమ్మ వారికి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త మండలి చైర్మన్ అచ్చయ్యనాయుడు, బ్రహ్మనాయుడు, ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి, ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లు శర్మ, పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ఉదయగిరి: ఉదయగిరి–నందవరం మార్గంలో డబుల్ రోడ్డు నిర్మించాలని కోరుతూ సోమవారం ఉదయగిరికి చెందిన సామాజిక కార్యకర్త ఫయాజ్ నెల్లూరులో జరిగిన స్పందనలో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నుంచి నందవరం వరకు సుమారు 30 కి.మీ. ఈ రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులు, ప్రయాణికులకు నరకప్రాయంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా డబుల్‌రోడ్డు చేయాలనే ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చడం లేదన్నారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే



కృష్ణారెడ్డిపాలెంలో వైద్యసిబ్బంది సర్వే

కలిగిరి: మండలంలో కుష్ఠు వ్యాధిపై ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నామని వైద్యాధికారిణి బి.గీతారెడ్డి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నిర్మూలన చర్యల్లో భాగంగా ప్రభుత్వం వచ్చే నెల 16వ తేదీ వరకు సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరిశీలించి సర్వే నివేదికను తయారు చేస్తారన్నారు.


ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ



సూచనలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

అల్లూరు: అల్లూరు 1, 2 సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాన్ని కావలి ఆర్డీఓ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే కచ్చితత్వంతో చేపట్టి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు వరప్రసాద్, సుజాత, పెనుగొండయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజనుల మేలుకొలుపు



అల్లూరు: మండలంలోని ఇందుపూరు గిరిజన కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలని అందరూ అంబేడ్కర్ బాటలో పయనించాలన్నారు. నాయకులు ఎల్లు సాల్మాన్ రాజు, పంగులూరి శ్రీనివాసులు, ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, నక్క యాదగిరి పాల్గొన్నారు.

ఆగని అక్రమాలు

కావలిలో భూ అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఇటీవల రిజిస్ట్రేషన్ కార్యాలయం కేంద్రంగా దళారులు, సిబ్బంది కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్లతో అలజడి సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా పోలీస్ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ విషయం మర్చిపోక ముందే మీ సేవ కేంద్రం నిర్వాహకుడు సృష్టించిన నకిలీ సర్టిఫికెట్లు, ఐడీలతో సరికొత్త మోసం వెలుగుచూసింది.

- నకిలీ రికార్డులతో భూ మార్పిడి దందాలు
- తాజాగా మీసేవ కేంద్రాల ద్వారా అక్రమాలు
- అధికారుల అప్రమత్తతతో వెలుగులోకి వచ్చిన మోసం



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మాధవరెడ్డి (ఫైల్)

కావలి: కావలి.. మరో హైదరాబాద్‌గా మారిపోయింది. ఒకే భూమికి నలుగురైదుగురు యజమానులు పుట్టుకు వస్తున్నారు. నకిలీ పత్రాలు, ఐడీలు సృష్టించి భూములకు ఏకంగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని కింది స్థాయి సిబ్బంది సహకారంతో భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ల ప్రక్రియ జరిగిపోతోంది. కొద్ది రోజులుగా నకిలీ స్టాంప్ పేపర్లు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో అసలు యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు చేయడం, ప్రభుత్వ భూములకు కూడా పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించడం వంటి ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. కావలి మండలం రుద్రకోట సమీపంలోని సర్వే నంబరు 515–1లో విత్తనాభివృద్ధి సంస్థకు కేటాయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ అక్రమార్కులు రూ.14 లక్షలు స్వాహా చేసిన ఘటన మార్చిలో కలకలం సృష్టించింది. రిజిస్ట్రేషన్ కోసం పక్కాగా నకిలీ రెవెన్యూ రికార్డులు కూడా తయారు చేశారు. నీటి తీరువా, అడంగళ్ కాపీలతో పాటు ఏకంగా సబ్‌రిస్ట్రార్ స్టాంప్, సంతకాలను కూడా ఫోర్జరీ చేశారు. ఈ ఘటన వెలుగు చూడడంతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. దీంతో ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేశారు. ఆ తర్వాత కొండాపురం మండలం కొమ్మికి చెందిన వ్యక్తి భూమిని అతనికి తెలియకుండానే అతని ఫొటోలు, ఆధార్ కార్డ్ ఇచ్చి 100 అంకణాల భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ ఘటనలో దళారులతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది పాత్ర కూడా ఉన్నట్లు అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. తరచుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు కఠిన చర్యలు చేపట్టకపోవడం, విచారణ పేరుతో కాలయాపన చేస్తుండడంతో మోసగాళ్లు, దళారులు చెలరేగిపోతున్నారు. రైతులు, కొనుగోలుదారులు వణికిపోతున్నారు.

తాజాగా మరో మోసం

కావలి మండలం చెన్నాయపాళెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 48లో 12 ఎకరాల భూమిని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి తన పేరుతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయగా రెవెన్యూ అధికారుల అప్రమత్తతతో మోసం బయటపడింది. మీసేవ కేంద్రం నుంచి వచ్చిన దరఖాస్తును తహసీల్దార్ కె. మాధవరెడ్డి క్షుణ్ణంగా పరిశీలించడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో తహసీల్దార్ విషయాన్ని ఆర్డీఓ వీకే శీనానాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆర్డీఓ వీకే శీనానాయక్ పూర్తిస్థాయి విచారణ చేపట్టారు మ్యుటేషన్‌కు సంబంధించి కొత్త తరహా మోసాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూయజమానులకు, దరఖాస్తుదారులకు ఎటువంటి సంబంధం లేకపోయినా కుటుంబ సభ్యులుగా నకిలీ ఐడీలు సృష్టించి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేశారు. జనతాపేటలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు నకిలీ పత్రాలు, ఐడీలు సృష్టించినట్లు తెలియడంతో మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. రైతులు, కొనుగోలుదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని కింది స్థాయి సిబ్బంది, మీసేవ కేంద్రాల నిర్వాహకులు వరుసగా అక్రమాలకు పాల్పడుతుండడం, అధికారులు కూడా కఠిన చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయమై ఆర్డీఓ మాట్లాడుతూ మ్యుటేషన్లు, పాసుపుస్తకాలు, అడంగళ్‌లో మార్పులు, చేర్పులు అవసరమైన రైతులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

త్వరితగతిన శ్రీవారి పుష్కరిణి నిర్మాణం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి



కొండబిట్రగుంట కోనేరు వద్ద రెండో దశ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రణాళికలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో భారీ వ్యయంతో చేపట్టిన శ్రీవారి పుష్కరిణి నిర్మాణ పనులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కొండ దిగువన సుమారు రూ.7 కోట్ల పైచిలుకు వ్యయంతో సుందరమైన పుష్కరిణి నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. భక్తులు, దాతలను ఏకతాటిపైకి తీసుకువచ్చి చేపట్టిన ఈ నిర్మాణంలో తొలి దశ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే ఆ పనులు పరిశీలించి అధికారులు, ఇంజినీర్లతో చర్చించారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పుష్కరిణి చుట్టూ అందమైన ఉద్యానవనాలు, స్వామివారి అలంకరణకు, సేవకు వినియోగించే పూలతోటలు, తులసీ వనాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రకృతి, ఆధ్యాత్మికత మేళవించి భక్తులకు చక్కటి అనుభూతిని కల్పించేలా అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట విశ్రాంత పంచాయతీరాజ్ ఇంజినీర్ గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం వెంగంపల్లి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కర్ణా టీమ్ సోమవారం నగదు బహుమతులు అందజేసింది. 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 543 మార్కులు సాధించిన గురజాల కావ్యకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా 526 మార్కులు సాధించిన పఠాన్‌లాల్ మున్నీకు రూ.3 వేలు, తృతీయ బహుమతిగా 488 మార్కులు సాధించిన సానా అశ్వినికి రూ.2 వేలు అందించారు. విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నాయకులు సానా నారాయణరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, సభ్యులు వెన్నపూస సురేంద్ర, ఎస్.నాగార్జున, ఎస్.రాజశేఖర్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సై ఇంద్రసేనారెడ్డికి సన్మానం

ఉదయగిరి: ఉదయగిరి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కర్నాటి ఇంద్రసేనారెడ్డిని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణ టీడీపీ నేతలు, కార్యకర్తలు సత్కరించారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయ్యన్న, నరసింహులు, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ ఫిరోజ్



మాదక ద్రవ్యాలతో జరిగే అనర్థాలను వివరిస్తున్న సెబ్ సీఐ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- సెబ్ సీఐ నాయనతార

ఆత్మకూరు: మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, తీసుకోవడం నేరమని, వీటితో ఆరోగ్యపరమైన సమస్యలు, పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని సెబ్ సీఐ బి.నాయనతార అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులోని ప్రియదర్శిని కళాశాలలో విద్యార్థులకు సోమవారం సెబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. తొలుత మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు ఎస్. వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాలు నాశనం

వింజమూరు (ఉదయగిరి): కొంతమంది విద్యార్థులు మాదక ద్రవ్యాల వాడకానికి అలవాటు పడుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని కలిగిరి సెబ్ అధికారి అశోక్‌కుమార్ అన్నారు. వింజమూరులోని నేతాజా జూనియర్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ కానిస్టేబుళ్లు ఎస్.సుధాకర్, ఏ మధుసూదన్‌రావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిషేదంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ విద్యార్థులతో కలిసి జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు 'యువత మేలుకో డ్రగ్స్ మానుకో' నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

కావలి రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలతో సంతోషంగా ఉండాలని ఎస్‌ఈబీ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల వలన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తుకు బానిసై అనేక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీధర్, సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: విద్యార్థులు చదువుకునే సమయంలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే పలు అనర్థాలు కలుగుతాయని కలిగిరి సీఐ ఎండీ ఫిరోజ్ తెలిపారు. కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు తీసుకున్నా, అమ్మినా పట్టుబడితే కేసులు నమోదై జైలుపాలవుతారన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై ఎం సూర్యప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉదయగిరి: సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని స్థానిక సీఐ వి.గిరిబాబు అన్నారు. ఆయన సోమవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఆరోగ్యం కాపాడుకోవాలని వరికుంటపాడు ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

పాఠశాలకు వంటసామగ్రి వితరణ

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 'మన ఫౌండేషన్' అధినేత, మాజీ ఎంపీపీ మన్నేటి వెంకటరెడ్డి సోమవారం తన ప్రతినిధుల ద్వారా రూ.15 వేలు విలువ చేసే వంటసామగ్రిని పాఠశాల హెచ్‌ఎం భిక్షాల్‌కు అందజేశారు. భవిష్యత్తులో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు రంతుజాని, బోగ్యం శ్రీనివాసులు, అర్షత్, బాబు, తాహెర్, నౌషాద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొట్టాలపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి సోమవారం తన ప్రతినిధుల ద్వారా ప్లేట్లు, గ్లాసులను ఎంఈఓ–2 తోట శ్రీనివాసరావు పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగయ్య, ఉపాధ్యాయులు గౌస్‌బాషా, మహ్మద్, సారథి, ఎస్దాని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి బహుముఖ ప్రణాళికలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): దివంగత మంత్రి, తన సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో ఏడాది క్రితం ఇదే రోజు 82,888 ఓట్ల మెజార్టీతో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని, తన అన్న ఆశయ సాధనలో భాగంగా ఆత్మకూరు అభివృద్ధికి బహుముఖ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో తన స్వగృహంలో సోమవారం ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాది పూర్తయిన సందర్భంగా నాయకులు, అభిమానుల నడుమ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకుల మద్దతుతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 50 వేలకుపైగా ఇళ్లను సందర్శించి ప్రజలకు జరిగిన మంచిని వివరించామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం, ఎంజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ పెద్దలు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గంలో ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు, మర్రిపాడు, చేజర్ల, అనుమసముద్రంపేట, సంగం, అనంతసాగరం మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలోనే సమస్యల పరిష్కారం

- సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించాలి
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



గృహయజమానులకు జగనన్న సురక్ష కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

బిట్రగుంట: ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిట్రగుంటలోని విశ్వనాథరావుపేట పంచాయతీలో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఏఏ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు, ఏఏ పథకాలు మంజూరయ్యాయనే అంశాలు అడిగి తెలుసుకోవడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలపై కూడా ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని, సాంకేతిక సమస్యలు, శాఖాపరమైన ఇబ్బందులు, లబ్ధిదారుల్లో అవగాహన లేకపోవడంతో తదితర సమస్యలతో ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు తమకు కేటాయించిన ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు, వారి సమస్యలు నమోదు చేసుకుంటారని తెలిపారు. ఈ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల, ఎంపీడీఓ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు యాదవ్, షమీవుల్లా, సుందర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు గుర్తించండి



ఆత్మకూరు సచివాలయంలో జగనన్న సురక్షపై వివరిస్తున్న డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు సమష్టిగా విజయవంతం చేయాలని పట్టణ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 12, 13, 14 వార్డు సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష విధి విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, వార్డు కౌన్సిలర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాల వద్దకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హతలు ఉండి అందకుండా ఉన్న వారిని గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సమస్యలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు తోకల తిరుపతమ్మ, పొడమేకల పెంచలయ్య, కొండా చిన్న వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

చేజర్ల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ కోరారు. సోమవారం మండలంలోని చిత్తలూరులో జగనన్న సురక్ష పథకం సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటే వలంటీర్ల ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియ జేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు జగనన్న సురక్షపై అవగాహన కల్పించి పలు విషయాలు తెలియజేశారు. ఆదూరుపల్లిలో జగన్న సురక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా ఈఓపీఆర్డీ రామయ్య పాల్గొన్నారు.

అనంతసాగరంలో

అనంతసాగరం–1 సచివాలయ పరిధిలో జగనన్న సురక్షలో భాగంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్, సచివాలయం–2లో ఎంపీడీఓ మధుసూదనరావు పరిశీలించారు. జగనన్న సురక్ష పథకం సర్వేను వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లారు. సమస్యలు పరిష్కారం కాకుంటే వలంటీర్ల ద్వారా జగనన్న సురక్ష లో తెలియ జేస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

అంకితభావంతో సర్వే నిర్వహించాలి

ఉదయగిరి: మండలంలో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇంటింటి సర్వేను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంకితభావంతో నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.మల్లికార్జునరావు తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని నేలటూరు సచివాలయంలో జగనన్న సురక్షపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు, అవసరమైన ధ్రువపత్రాలను గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. సురక్షలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి

- ఎంపీపీ పద్మావతి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ పాలక వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యపై పంచాయతీ సిబ్బంది, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లు, మంచినీటి పథకాలకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. జగనన్న ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్మించుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి స్థలం లేని వారిని వలంటీర్ల ద్వారా గుర్తించి వారికి స్థలం ఇప్పించేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించి వారికి గిట్టుబాటు కూలీ నగదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమైన దృష్ట్యా నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు, ఎంఈఓ మస్తాన్‌వలి, పీఆర్ ఏఈ తిరుమలయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జగన్నాదం, అగ్రికల్చర్ ఏఓ చెన్నారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులను చేపట్టండి

జలదంకి: ఉపాధి హామీ పనులను ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా చేపట్టాలని ఏపీడీ గాయత్రీదేవి అన్నారు. సోమవారం చినక్రాకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనుల్లో అవినీతి జరిగితే సహించేది లేదన్నారు. మస్టర్ల నమోదులో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామల, టెక్నికల్ అసిస్టెంట్లు చిరంజీవి, వెంకటస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.